

# శశిరేఖ

### చెళ్లారి సీతారాజేశ్వరరావు

నర్సాపురం,
31-2-77

ప్రియమైన సౌభాగ్యం :

నేను పాత సంవత్సరం ఆఖరిరోజున ఆఖరి వుత్తరం రాస్తున్నాను. కొత్త సంవత్సరంలో, కొత్త పరిస్థితిలో నువ్వీ వుత్తరాన్ని చదువుతావు నువ్వు యింటికి వచ్చి తెల్సుకున్నది వేరు ఈ వుత్తరంలో నీవు చదివేది వేరు. ఏది నిజం? ఏది అబద్ధం? అని నీకు అనుమానం రావచ్చు మనిషిగా జీవించ లేక మృత్యువుని ప్రేమించిన నేను చివరి దశలో అబద్ధం చెప్తానా? సౌభాగ్యం నువ్వు మెడికల్ స్టూడెంటువి. సెంటిమెంట్సు నీకుండక పోవచ్చు మానవశరీరం రక్తం, మాంసం, ఎముకల ముద్దగా నీకు కనిపించవచ్చు. వీటన్నిటికీ అతీతంగా మనస్సుకూడ వుంది. అది దెబ్బతిన్నాక మనిషి జీవించలేడు పరిస్థితిని సర్దుబాటుచేసుకో లేక పలాయనం చిత్తగిస్తాడు. ఇది నీకు పిరికితన మనిపించవచ్చు. ఆత్మహత్యకి

చాలా ధైర్యం కావాలి. ఆ ధైర్యం నాకెలా వచ్చిందో నీకీ వుత్తరం చెబుతుంది

యవ్వనం తీపి దాని అశలు తీపి. వాటికి వారసమయ్యే భవితవ్యం తీపి. ఈ మధుర పీచికలు సుడిగుండాల్లో చిక్కుకుపోతే చరిత్ర మారిపోతుంది. పాలు వొలికిపోతాయి! వసంతం శిశిర మవుతుంది ప్రభాతంపై మబ్బులు కమ్మి అసురసంధ్య వ్యాపిస్తుంది

అచ్యుతరామయ్యగారు వచ్చి గృహ ప్రవేశం శుభలేఖ యిచ్చివెళ్ళారు నాన్నగారు వెళదామనుకున్నారు కాని హఠాత్తుగా క్యాంప్‌కి వెళ్ళవల్సివచ్చింది.

"నువ్వెళ్ళు కామేశ్వరీ! ఎవరూ రాకపోతే బాధపడతాడు అచ్యుతం" నాన్నగారు మరీ మరీ చెప్పి వెళ్లారు అమ్మతో

అమ్మ ప్రయాణమైంది. అచ్యుత రామయ్యగారి కుటుంబంతో మన స్నేహం నీకు చెప్పనక్కర్లేదు అమ్మ ప్రయాణంలో మరో ముఖ్యకార్యక్రమం నాకు సంబంధాలు చూడటం. ఇలాంటప్పుడు నాలుగు కుటుంబాలవారు వస్తారు కదా!

కాని అమ్మ ముచ్చటకి అడ్డంవచ్చింది అనారోగ్యం కీళ్ళవాతంతో మంచం ఎక్కింది.

"నువ్వెళ్ళు శశీ," అన్నది అమ్మ.

"నేను ఒక్కదాన్నినా?" భయంగా అడిగాను. నాకు నలుగురిలో తిరగడం ఎంత భయమో నీకు తెల్సుకదా! కాలేజీ అవగానే డైరక్ట్‌గా యింటికి వచ్చే నాలాంటిరకం కొత్తచోట కొత్త మనుషుల మధ్య మసలగలదా?

"ఇక్కడ బస్సుఎక్కి ఏలూరులో దిగడమే కదే! వైరిస్తే సుమిత్ర బస్సు స్టాండుకి వస్తుంది మీ నాన్నగారు మరీ మరీ చెప్పి వెళ్లారు. ఎవరూ వెళ్ళకపోతే నామీద మండిపడతారు."

అమ్మ నచ్చచెప్పడంతో అయిష్టంగానే బయలుదేరాను. సుమిత్రకి వైర్ యివ్వలేదు ఆ టెలిగ్రాము నేను వెళ్లాక వస్తుందని.

నేను ఎక్కిన బస్సు మధ్యలో పాడైపోవడంవల్ల, ఏలూరు చేరుకునేసరికి రాత్రి తొమ్మిదయింది బస్సు ఆగగానే ఈగల్లా రిక్షావాళ్ళు మూగారు ఓ ముసలి తాతని పిలిచి 'రామచంద్రరావుపేట' అని చెప్పి ఎక్కాను.

రిక్షాలోంచి తెలియని పట్టణాన్ని భయంగా చూస్తున్నాను వీధి దీపాల వెలుగుల్లో రాత్రి పట్టణం నిద్రపోతున్న మృగరాజుల్లా కనిపించింది నాకు!

రిక్షావాడు క్రాస్‌రోడ్‌లో ఆపి "ఎటు పోవాలా అమ్మా!" అని అడిగాడు. నాకేం తెల్సు? భయంగా అటు ఇటు చూశాను

అమ్మ చెప్పిన గుర్తులు గుర్తుచేసుకో సాగేను.

ఓ మధ్యవయస్కుడు రిక్షాదగ్గరికి వచ్చి "ఎవరింటికమ్మాయ్ !" అడిగాడు. నేను అశగా చెప్పాను

"నాకు తెల్సినంతలో అటువంటి వారెవరూ యిక్కడ లేరే ?" తనకి తెలియకుండా యిక్కడ యెవరూ వుండ టానికి వీల్లేదన్నట్లు.

నాకు భయ మధికమయింది.

"ఏటమ్మా సరయిన ఎడ్రెసు వుందొద్దూ?" రిక్షావాడు ఆలస్యమై పోతున్నందుకు విసుక్కుంటూ ఎదరికి పోనిచ్చాడు

ఈ రిక్షావాళ్ళు చాల దుర్మార్గులు. ఎక్కేదాకా బ్రతిమాలతారు. ఎక్కాక మనల్ని తిప్పలు పెడతారు

దూరంగా లైట్లతో పందిరి కనిపిస్తోంది

అదే నా గమ్యం కాకూడదూ అచ్యుతరామయ్యగారిల్లు పట్టుకోలేకుంటే ఈ రాత్రంతా ఏంచెయ్యాలి ?

అదృష్టం ! సుమిత్ర పందిరిలో పువ్వులు బేరంచేస్తోంది అప్పటిదాకా వేధించిన పిరికితనం సెలవుతీసుకుంది

"వెల్‌కమ్ ! స్వాగతం" సుమిత్ర దూరాన్నుంచే అరచింది ఆమెచుట్టూ వున్న స్త్రీలు నాకేసి 'ఎవరన్నట్టు' చూశారు

రిక్షావాడ్ని పంపి అన్ని జతల కళ్ళ పరీక్షలు తట్టుకుంటూ బెదురుతూ బెంగతో ఆమెకేసి నడిచాను.

"ఉత్తరం రాస్తే పూర్ణకుంభంతో స్వాగతం ఏర్పాటు చేసేదాన్నిగా "

"మంచినీళ్ళు చాలు తల్లీ !" అన్నాను నవ్వుతూ మధ్యాహ్నంనుంచి ఏమీ తీసుకోపోవడంతో నీర్సంగా వుంది.

"ఈకాలం పిల్లలు దేనికి పనికొస్తారే!" సుమిత్ర నా ఈడుదయినా, ఆరిందాలా మాట్లాడటంలో అక్కడివాళ్ళంతా నవ్వారు.


సమిత్ర మాటలపోగు గలగలా సెలయేరులా వుంటుంది 'పోలయ్యా... సంచీ నా గదిలో పెట్టు' అని నౌకర్ని పురమాయించి నన్ను లోపలికి తీసుకెళ్ళింది.

ఇల్లంతా బంధువులతో స్నేహితులతో నిండివుంది అందులో అచ్యుతరామయ్య గారిది పోలీసుద్యోగం. ఇలాంటి కార్య క్రమాలకి మనుషులకేం లోటు ?

వంటవాళ్లతో మాట్లాడుతున్న ఆయన నన్ను చూసి "ఏమ్మా! నాన్న రాలేదా? వాడంతేలే! ఇడియట్ నీపెళ్ళికి నేను అలాగే చేస్తాలే" దగ్గరకొచ్చారు

"సుమిత్ర పెళ్ళయితే ఆయనా మిస్సయ్యేవారు కారు" అన్నాను

పెళ్ళి మాటతో సుమిత్ర పారిపోతుం దనుకున్నాను కాని అది మొండిఘటం. తండ్రికంటె ముందుగానే "గృహ ప్రవేశంతో పెళ్లిచేస్తే అల్లుడుగారు యిల్లు 'బహుమతి'గా అడుగుతారని ముందుకు పొడిగించారు " అంది




"చూశావా అమ్మా యిదెంత రాలుగాయో" అన్నారు ఆయన.

"పెళ్లితో పైత్యం దిగిపోతుంది మామయ్యగారూ!" అన్నా నవ్వి.

ఎవరో రావడంతో ఆయన వాళ్ళతో వెళ్ళిపోయారు సుమిత్ర నన్ను వంట షెడ్డులోకి తీసుకెళ్ళింది. శారదాంబగారు మరికొంతమంది అక్కడ మిఠాయి తయారుచేస్తున్నారు.

"అమ్మా! శశి అప్పచ్చి కావాలంటోంది." సుమిత్ర అడిగింది.

"అందరిపేరూ చెప్పి ఇది పన్నెండో వుండ నువ్వు తినడం" అన్నారావిడ. నాకేసి తిరిగి "ప్రయాణం కులాసాగా సాగిందమ్మా" ప్రశ్నించారు.

తలూపాను.

ఎవరో టిఫిన్, కాఫీ తెచ్చారు.

"లాగిస్తూండు ఇప్పుడే వస్తాను. అన్నగారు పిలుస్తున్నారు." సుమిత్ర హడావిడిగా వెళ్ళిపోయింది.

"ఎవరే శారదా ఈ పిల్ల" ఓ బామ్మగారు ఎంక్వయిరీ చేసింది ఆవిడ చెప్పగానే-

"సంబంధాలు చూస్తున్నారటే?" డైరక్టుగా నన్నే అడిగేసింది.

ఇలాంటి కుతూహలం కూడా మన సంస్కృతిలో ఒక భాగమే అయి వుంటుంది ఏదో సమాధానం చెప్పినా ఆ బామ్మగారు అనుబంధంగా యింకా ప్రశ్నలు వేస్తూనేవుంది ఇంతలో సుమిత్ర వచ్చి నన్ను రక్షించింది.

భోజనా లయ్యేసరికి పది దాటింది. ప్రయాణపు అలసటవల్ల నాకు నిద్ర ముంచుకు వస్తున్నది. సుమిత్ర

అక్కడికి ఇక్కడికి నన్ను తిప్పుతూనే వుంది ఎరక్కపోయి వచ్చానా బాబూ అనుకున్నాను

"ఎంతచేసినా పని యింకా వుంటూనే వుంటుంది రా. పడుకుందాం" అంది సుమిత్ర పన్నెండు దాటాక.

కాని ఆమె గదిలో సుమిత్ర చిన్నక్క, పెద్దక్క పిల్లలు మంచాల మీద బల్లలమీద అడ్డదిడ్డంగా పడుకుని వున్నారు. వాళ్ళని లేపడం యిష్టంలేక పక్కకి జరిపి మేంకూడ విశ్రమించాం.

కరెంటు పోయింది. పావుగంటయినా రాలేదు ఆ గది అసలే భూగృహం. పైగా మించిన సామాను. దోమల సంగీతానికి తోడు, వుడకపోత మాకు శివరాత్రే అయింది

కాలేజీలోని ముచ్చట్లు, స్నేహితుల జాడా చెప్పుకుంటూ, నవ్వుకుంటూ తెల్లవార్చేం!

గృహప్రవేశం ఆడంబరంగా జరిగింది.

మర్నాడు నేను ప్రయాణమయ్యాను, "అమ్మకి వంట్లో బాగాలేదు" అంటూ!

"నువ్వేం వైద్య శిఖామణివి కాదు. తగ్గు" సుమిత్ర నోర్మూసింది.

బంధువు లందరూ వెళ్లిపోయారు సందడి తగ్గింది కొత్తయిల్లు అధికారం లోకి వచ్చిన నాయకురాల్లా గర్వంగా చూస్తోంది

"శశీ! నడు టైంలేదు" సుమిత్ర పౌడర్ రాసుకుంటూ హడావిడిగా వచ్చింది

"ఎక్కడికే" చదువుతున్న పత్రిక మూస్తూ అడిగాను

"సస్పెన్స్ ఇక్కడ చెప్పబడదు"

రిక్షా సిన్మాహాలుముందు ఆగింది.

"సిన్మాకా?" దిగుతూ అడిగాను.

"వంకాయలు కొనడానికి కాదు."

కళాపోషకులతో సినిమా హాలు ప్రాంగణం క్రిక్కిరిసి వుంది ప్రతిష్టాత్మక, ప్రయోగాత్మక వర్ణ చిత్రం 'వంకర మనసులు' రిలీజ్ ఈనాడే. హీరోయిన్ బాత్రూం బ్యానర్ చూసి కొన్నివర్గాల ప్రేక్షకులు నోరు చప్పరిస్తున్నారు.

"ఈ చెత్త చూడ్డాని కింత కంగారెందుకే? ఈ జనంలో మనకి టిక్కెట్లు దొరుకుతాయా?" సుమిత్రతో కౌంటర్ కేసి నడుస్తూ చిరాగ్గా అడిగాను.

బ్లాక్‌వాళ్ళు పబ్లిక్‌గా అరుస్తున్నారు.

"బిడ్డా! మా హీరో చిత్రం మొదటి రోజు మొదటిఆట చూసేస్తానని శపథం చేసాను ఆరేళ్ళనుంచి నోము శ్రద్ధగా చేస్తున్నాను ఈ జనాన్నిచూసి కంగారు పడకు. వీళ్ళంతా ప్రేక్షకులు కారు. జేబుదొంగలూ, ఫోజుల రాయుళ్ళూ ఎక్కువ" సుమిత్ర చిన్నగా ఉపన్యాసం యిచ్చింది

నేను ఒక మూలగా వింటున్నాను.

సుమిత్ర చప్పట్లుకొట్టి 'గిరీ' అని పిలిచింది అతను దగ్గరకొచ్చాడు

"రెండు టిక్కెట్లు ప్రసాదం "

"విత్ ప్లెజర్" అతను డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు.

జీవితానికి చొరవ వుండాలి దానివల్ల అపకారంకన్న ఉపకారమే ఎక్కువగా వుంటుంది 'చొరవ' అన్నది దిగుమతి చేసుకునే సరుకుకాదు తయారు చేసుకోవాలి సుమిత్రకి తనకేం కావాలో తెల్సు

"అతడెవరో తెల్సా?"

"తెలియదు''

"బాగా జ్ఞాపకం తెచ్చుకో."

"బాగుంది మీవూళ్ళోవాళ్ళు నాకెలా తెలుస్తారు?" విసుగ్గా అన్నాను

సుమిత్ర నా బుగ్గలు నొక్కింది "కోపంలో నువ్వు చాలా బాగుంటావు అప్పలమ్మా ఈ భంగిమలో ఏ రాజకుమారుడు చూసినా ఎగరేసుకుపోతాడు "

"అదొక్కటే తక్కువ "

"ఇంకా ఎవరూ తగల్లేదని నిరాశా? వ్చ్! విచారం వలదు బిడ్డా భవిష్యత్తంతా మనదే "

నేను కసిరాను "సుమిత్రా! నాకు పిచ్చెక్కేలా వుంది నువ్వు కాస్సేపు నిశ్శబ్దంగా వుండు "

"అతడెవరో చెప్పొద్దూ మీ జయమ్మత్తయ్య కొడుకు. ది గ్రేట్ భువనగిరి మా యింటికి దగ్గర్లోనే వుంటున్నారు నిన్ను అతడు గుర్తుపట్టాడు కాని ఆ ధ్యాస వున్నట్లేలేదు నీకు "

"మరి ముందరే చెప్పొద్దూ" నొచ్చుకుంటూ అన్నాను.

"బావతో బాతాఖానీ వేసేదానివా? ఇప్పుడే మయింది మరో క్షణంలో రానేవస్తాడు 'బావా ఎచటినుండి రాక' పద్యం అందుకో!"

సమాధానం చెప్పకుండా సుమిత్ర సంభాషణం వింటున్నట్లు నటిస్తున్నాను. అత్తయ్యగారి కుటుంబం, మన కుటుంబం గత ఏడెనిమి దేళ్ళుగా విడిపోయాయి నాన్నగారిది మామయ్యగారిది ఒకే వుద్యోగం కావడంవల్ల ఆఫీసు గొడవల్లో యిద్దరూ పోట్లాడుకున్నారు ఆ వైరం కుటుంబాల్లోకి చొరబడింది. మామయ్యగారు పోయినప్పుడు కూడా నాన్నగారు ఒక్కరే వెళ్ళి ముభావంగా వచ్చేశారు

భువనగిరి టిక్కెట్లతో వచ్చేశాడు. సుమిత్రే తిరిగి మా యిద్దరికీ పరిచయం చేసింది

"బాగున్నావా శశీ" ఆత్మీయంగా పల్కరించాడు

తలూపాను

"జస్ట్ వన్ మినిట్, "సుమిత్ర ఎదర కెళ్ళింది అతడి ముందు ఒక్కతిని నిలబడడానికి బెదురుగా వుంది

"అత్తయ్యా, మామయ్య కులాసా"

"ఆఁ"

"సౌభాగ్యం ఏం చేస్తోంది."

చెప్పాను.

వైరం సంగతి గుర్తు లేకుండా అతడంత కులుపుగోరుతనంగా మాట్లాడట్టం నన్ను ఆశ్చర్యపరిచింది.

"ఏం చేస్తున్నావు?" మొదటిసారిగా ప్రశ్నించాను.

"యం. కాం. ప్యాసయ్యి రోడ్లు కొలుస్తున్నాను." ట్రాజడీగా నవ్వాడు.

యువతరం భవితవ్యం కాలేజీ గేట్ల దగ్గరే ఆగిపోతోంది.

"ప్రయత్నించడం లేదా?" సానుభూతిగా అడిగాను.

"ఉత్తరాలు సంపాదిస్తున్నా. దక్షణ మన చేతిలో లేదుకదా! దక్షిణ యిస్తే కాని ఏ వుద్యోగం రాదు."

సుమిత్ర వచ్చింది. సినిమాకి బెల్ కొట్టారు. ఆ ఫార్ములా సినిమా అరగంట చూసేసరికి నాకు తలనొప్పి వచ్చింది. సుమిత్రకోసం బలవంతంగా కూర్చున్నాను. భువనగిరి సాయంత్రం యింటికి రమ్మని కోరాడు సినిమా అయ్యాక. రానని చెప్పలేకపోయాను.

వెళ్లేటప్పుడు మాకు రిక్షాలు దొరకలేదు. పది నిముషాలు ఆగినా వచ్చే రిక్షాలేం కనిపించలేదు. ఆకలిమీదున్నాం కనుక నడిచే బయలుదేరాం.

"ఏమంటాడు గిరి?" సుమిత్ర అడిగింది.

"నాతో ఏమనందే!"

"శశీ! భువనగిరి వీణ గొప్పగా వాయిస్తాడు. రేడియాలో కూడ రెండు సార్లు కచేరీ చేశాడు. కొన్నాళ్ళపాటు నేనూ అతడి శిష్యరికం చేశాను."

"అయితే నువ్వూ వీణ వాయిస్తా వన్నమాట."

"చంపావ్ పో...మీరంతా పిచ్చెక్కి ప్రమాదం లేకుండా విరమించాను. నువ్వు నేర్చుకో శశీ! నాకయితే బాగా వస్తుంది."

శారదాంబగారు భోజనం చెయ్యకుండా మాకోసం ఎదురు చూస్తున్నారు. అన్నం తినగానే అలసటగా పడుకున్నాను. నేను లేచేసరికి అయిదు దాటింది. సుమిత్ర ఎక్కడా కనిపించలేదు.

శారదాంబగారు టీ యిచ్చారు. "చంద్రకాంతం వచ్చిందని దానితో వెళ్లింది. వచ్చేస్తూంటుంది."

నేను స్నానంచేసి ముస్తాబయినా సుమిత్ర రాలేదు. పోర్టికోలో వంటరిగా నించున్నాను. అత్తయ్యగారింటి కెళితే!.... దగ్గరయినా నాకేం తెలుస్తుంది? శారదాంబగార్ని అడగటం సిగ్గువేసింది

సైకిల్ బెల్‌కి తలఎత్తాను. భువనగిరి గేటు దగ్గర వున్నాడు అతడెందుకు వచ్చాడో నాకు తెల్సు.

"అమ్మ నిన్ను చూడాలంటోంది శశీ।"

నాకు వెళ్లాలని వుంది. వెళ్ళకుండా వుండాలని వుంది మనస్సు ద్వంద్వంలో వుంది. 'రా శశీ' అని బావ హెచ్చరించడంతో బయలుదేరాను అత్తయ్య కుట్టుమిషనుమీద పనిచేస్తోంది నన్ను చూసి 'రా అమ్మా గిరి చెప్పాడు.' అంది లోపలకి తీసుకెళుతూ।

ఇరుకయిన మూడు గదులు. దరిద్రం నగ్నంగా కనిపిస్తోంది అత్తయ్యలోను, బావలోను పరిస్థితులు నేర్పిన నిబ్బరం కనిపిస్తుంది. బావ పెరట్లో బాదం చెట్టుక్రింద కుర్చీలు వేశాడు అత్తయ్య ఉప్మా కాఫీ తయారు చేసి పట్టుకు వచ్చింది

కుశల ప్రశ్నలయ్యాయి

"మా తరం పట్టుదలలు, పగలలోను గడిచిపోయిందమ్మాయ్। నేను ఎవర్నీ తప్పు పట్టడంలేదు మా సంస్కారమే అంత మీ రయినా రక్తసంబంధికులనిపించుకోండమ్మా। ఆయన పోయినా తమ్ముడి కోపం తగ్గలేదు ప్చ్। వాడ్నెందుకు లే అనడం మా అదృష్టం యిలా వుంటే। గిరికేదయినా దారి దొరికితే మేమూ మనుషుల్లోకి వస్తాం।"

అత్తయ్య గొంతువిండా వేదన। నిట్టూర్పుల ఆక్రందన. నేను శత్రుపక్షం మనిషినవడం నాకే సిగ్గుగావుంది. తప్పంతా మనదే ననిపిస్తోంది కూడా. వారి సంస్కారం అడుగడుగునా నన్ను కదిలించివేస్తున్నది.

"మన గొడవలన్నీ చెప్పి శశిని ఏడిపించకమ్మా" అన్నాడు బావ

"అయినవాళ్ళదగ్గర చెప్పుకోడానికి నా మోషీ ఏమిట్రా ''

జయమ్మత్తయ్య బోళామనిషి ఆ కాస్సేపట్లో తమగురించి అంతా చెప్పేసుకుందామె మామయ్యగారు నిల్వచేసిన దానితో బావ చదువయింది అత్తయ్యే కుటుంబ భారం వహించింది కుట్టు మిషను కుటుంబాన్ని గెంటివేస్తున్నది. బావ అక్కడక్కడ సంగీతం పాఠాలు చెపుతున్నాట్ట వాళ్ళకి అదృష్టం అందక పోతున్నా, దురదృష్టాన్ని మాత్రం వదిలించుకుంటున్నారు.

చీకటిపడేదాకా కబుర్లతో కాలక్షేపమయిపోయింది అత్తయ్య నన్ను భోజనానికి వుండమని కోరింది.

"మళ్ళీ వస్తాలే అత్తయ్యా."

"అది జగన్నాధం మామయ్య కూతురు. మనింట్లో ఎందుకు భోంచేస్తుందమ్మా?" భువనగిరి బావ నిష్ఠూరంగా అన్నాడు.

మనమీద అజ్ఞాతమైన కసి ఆ మాటల్లో

"నాకేం అలాంటిది లేదు" అభిమానంగా అన్నాను.

"అయితే భోజనంచేస్తావన్నమాట. థాంక్స్"

నేను కూడ కాదనలేకపోయాను. అత్తయ్య స్టవ్ వెలిగించింది నేను సాయం చేస్తానన్నా ఆమె ఒప్పుకోలేదు. "ఎంత వంటమ్మా నిన్ను కూడ కష్ట పెట్టడానికి.... గిరి దగ్గర పుస్తకా లుంటాయి చూడు."

బావ యిచ్చిన మ్యాగజైన్లు అన్నీ నేను చదివినవే. గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాను. "నీ వీణ కొంచెం వినిపించ కూడదూ.... సుమిత్ర గొప్పగా చెప్పింది."

"విత్ ప్లెజర్!"

సుమిత్ర చెప్పినదాంట్లో అతిశయోక్తి ఏంలేదు. తన్మయత్వం కలిగించేలా వాయించాడు.

"నీలో యింతటి కళాకారుడు వున్నా డనుకోలేదు." అభినందిస్తూ అన్నాను.

అతడు తమాషాగా నవ్వాడు. "కళ మా కళకోసం కాదు శశీ! మీ కన్నీళ్ళు మరచిపోడానికి."

వీడ్కోలుగా అత్తయ్య బ్లవుజ్‌పీస్, కుంకుమ యిచ్చింది. భువనగిరి నిశ్శబ్దంగా నిలబడ్డాడు. 'మళ్ళీ రా' మమ్మల్ని మరచి పోకు. జ్ఞాపకముంటాము కదూ'.... అంటూ అతడి కళ్ళు మాట్లాడుతున్నాయి.

మర్నాడుదయం బయలుదేరి నేను యింటికి వచ్చేశాను. అమ్మ అక్కడి విషయాలన్నీ వివరంగా అడిగింది. అత్తయ్య విషయం చెబ్దామా అను కున్నాను. కాని భయంవల్ల మాట్లాడ లేకపోయాను.

ఇంటికి చేరుకున్నట్లు సుమిత్రకి వుత్తరం రాస్తూ, అత్తయ్యకి కూడ రాశాను. తర్వాత నేను భయపడ్డాను. రెండు పడవల్లోను చెరోకాలు వేసి పయనిస్తున్నానా? విడిపోయిన రెండు కుటుంబాల మధ్య నేను చూపిస్తున్న చొరవ ఏ కొత్త పరిణామాలకి దారి తీస్తుంది?

వారంపోయాక బావ దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. విశేషాలేం లేవు. మరచిపోనందుకు కృతజ్ఞతలు తెలియ పరచాడు.

ఆ వుత్తరం నా భయాన్నెక్కువ చేసింది? నేను యింటిదగ్గర లేకపోతే వుత్తరం అమ్మ చేతిలో పడును. దాంతో కావలసినంత గొడవ చెలరేగును. ఆ రోజు నుంచి పోస్ట్ వచ్చే సమయానికి నేను విధిగా యింటిదగ్గరే వుంటున్నాను. కాని ఆ తర్వాత వుత్తరాలేం రాలేదు.

ఓసారి అమ్మ రాజోలు వెళతానంటే రేవు దాటించి బస్సు ఎక్కించాను. తిరిగి నేను రేవులోకి వచ్చాను.

సాయంత్రమైంది. నీరెండలో గోదావరి గోపికల బృందావనంలా వుంది. పడవకోసం నిరీక్షిస్తున్నాను.

"శశీ"

వెనక్కి తిరిగాను! భువనగిరి.



ఇద్దరం ఆశ్చర్యాలనుంచి కోలుకున్నాం. నవ్వుకున్నాం. బావ పడవ మాట్లాడాడు. సంధ్యగాలిలో కెరటాలమీద ఆ పయనం ఉత్తేజంగా వుంది ఉల్లాసంగా వుంది

"నిన్ననే నర్సాపురం వచ్చాను ఆది చంద్రిగారమ్మాయి మంగళకి వీణ నేర్పుతున్నాను. జీతం రెండు వందలు అన్నీ ఆయనింట్లోనే " బావ తనగురించి వివరాలు చెప్పాడు

"మరింటికి రాలేదేం," సగం భయం, సగం కోపంగా అడిగాను

"రేపు వస్తాను "

మరునాడు ఉదయంనుంచీ బావ కోసం ఎదురుచూస్తున్నాను అతడి రాకకోసం చేసే నిరీక్షణలో భయం . ఆనందం రెండూ వున్నాయి సాయంత్ర మైనా అతడు రాలేదు ముఖప్రీతి కోసం అలా చెప్పాడేమో! తండ్రి వైరం అతడికీ వారసత్వంగా వచ్చిందేమో?

సాయంత్రం నాన్నగారు ఆఫీసు నుంచి వచ్చి వరండాలో టీ తాగుతూ కూర్చున్నారు

"నమస్కారం మామయ్యా!"

భువనగిరి లోపలికి వచ్చాడు

నాన్నగారిలో కలవరం భువనగిరిని తేరిపార చూస్తూ, 'కూర్చో' అన్నాడు బలవంతంగా అతడి రాక ఆయన కేం యిష్టం లేనట్లుంది.

"అత్తయ్య లేదా?" బావ చొరవగా అడిగాడు

"లేదేమో।" నాన్నగారిలో ముఖావం బావతో మాట్లాడటం ఆయనకి నిప్పుల్లో నడుస్తున్నట్లయింది

ఆయన వైఖరి చూసి బావ మౌనంగా కూర్చున్నాడు అతడికిక్కూడ టీ యిచ్చి వారి సమావేశాన్ని వుద్విగ్నంగా చూస్తున్నాను

"ఏం చేస్తున్నావ్?" మాట్లాడక తప్పదన్నట్లు నాన్నగారడిగారు

"ఏం చెయ్యడంలేదు"

"మీ నాన్న పోలికే వచ్చిందన్న మాట"

"లేక నీ పోలిక వస్తుందా?"

"ఆ గర్వమే పాడుచేస్తోందిరా మీ కుటుంబాన్ని"

"నువ్వు బాగుచేయరాదూ?"

"నా కొంప అనాథశరణాలయం కాదు చేసుకున్నదానికి అనుభవించండి. మీ నాన్న నన్ను సర్వనాశనం చెయ్యాలని చూశాడు తాను తీసిన గోతిలో తానే పడ్డాడు మీ నీడ కూడ మామీద పడటానికి వీల్లేదు ఈ బంధుత్వాలు చాల్లే. వెళ్ళు?"

క్షణంలో రణరంగం సిద్ధమయిపోయింది బావ ఆవేశాన్ని అణచుకున్నట్లు కనిపించాడు. నాకేసి వెళుతున్నానన్నట్లు చూశాడు అతడి నిబ్బరానికి ఆనందించాను శశి పిలిస్తేనే వచ్చాను అంటాడేమోనని నేను భయంగా దిక్కులు చూస్తున్నాను

"సముద్రంలోని శిలలు కూడ కరుగుతాయని చదివాను మామయ్యా। అది అబద్ధమని చెప్పావు సెలవ్।" నవ్వుతూ వెళ్ళిపోయాడు

బావ వెళ్ళినా నాన్నగారు సణుగుతూనే వున్నారు

ఇంటికి వచ్చిన శతృవునికూడ ఆదరించవల్సిందే బావ అగౌరవింపబడి వెళ్ళిపోవడం నన్ను కలచివేసింది.

కక్షలు। కావేషాలు ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు? ఆవేశపు పొంగు అణగేదాకా తిట్టుకున్నా, సాధించుకున్నా ఫర్వాలేదు అక్కడ్నుంచయినా మార్పుండాలి గదా। క్షమించడం నేర్చుకుంటే చాల సమస్యలు తీరిపోతాయి సౌభాగ్యం। జీవితాంతం పగలు, శతృత్వాలు అయితే జీవితంలోని మాధుర్యమంతా ఆవే హరిస్తాయి

పదిహేను రోజులు గడిచాయి ఏం తోచక మ్యాట్నీకి బయలుదేరాను ఆ సినిమా వచ్చి చాలారోజులు కావడంవల్ల జనం అంతగా లేరు ఇంకా టిక్కెట్లు యివ్వడానికి వ్యవధి వుంది

నీలంరంగు అంబాసిడర్ నుంచి బావ, మరో అమ్మాయి దిగారు, 'హల్లో శశీ. మీట్ మై స్టూడెంటు మిస్ మంగళ'

ముగ్గురం థియేటర్లోకి నడిచాం. మంగళకి నాఈడే వుంటుంది నల్లగా, లావుగా వుంది వయస్సు తెచ్చిన ఆకర్షణ

కూడ స్తబ్దంగా వుంది. అలంకరణలో అందాన్ని దించుకోవాలని ఆమె తాపత్రయం

ఆదిచంద్రగారి పని వ్యాపారాలతో, వ్యవహారాలతో మూడు పువ్వులు ఆరు కాయలుగా వుంది ఐశ్వర్యంయొక్క మెరుగులు మంగళలో పుష్కలంగా కనిపిస్తున్నాయి. కాని డబ్బు యిచ్చే అధికారతనం ఆమెలో కనిపించలేదు. చాలా ఆత్మీయంగా మాట్లాడింది వెళ్లేటప్పుడు యింటికి రమ్మని బలవంతం చేసింది

ఆ సాయంత్రం కబుర్లుచెప్పుకుంటూ వారి తోటలో కూర్చున్నాం "మీరు తరచు వస్తూండాలి" అంది వీడ్కోలుగా.

బావ రోడ్డుదాకా సాయం వచ్చాడు.

"ఆ రోజు మా యింటిదగ్గర జరిగింది మరచిపో" అన్నాను క్షమార్పణగా.

అతడు నవ్వాడు "నేను ఆశించినదే దొరికింది నువ్వు తరచు కనిపిస్తూంటే ఆ బాధ మరచిపోగలను"

మంగళ యిల్లు దగ్గరకావడంవల్లో, బావని చూడాలన్న కాంక్షో రోజూ కాళ్లు అటు పరుగుతీసేవి ఇది మా సాన్నిహిత్యాన్ని వృద్ధిచేసింది. ఇది ఎదురీతని నాకూ తెలుసు భయమైన, కష్టమయినా గమ్యం అదే అనిపించినపుడు పయనం తప్పదు కదా!

ఓరోజు సాయంత్రం నేను వెళ్లేసరికి బంగళా నిశ్శబ్దంగా వుంది. లోపలి కెళ్లాను బావ జ్వరంతో మూల్గుతున్నాడు. తట్టి లేపేసరికి బలవంతంగా కళ్ళు తెరిచాడు మంగళ కుటుంబం పెళ్ళికి వెళ్ళారుట నేను తెల్సిన డాక్టర్ని పిలిచాను

ఇంజక్షను యిచ్చి, మందులు రాసిచ్చి "జాగ్రత్తగా చూస్తూండండి అవసరమయితే పిలవండి" వెళ్ళిపోయాడు డాక్టరు

ఆ రాత్రి అక్కడే వుండటం నాకు శక్తికిమించిన పని ఇంటిదగ్గర గొడవ, వదిలివెళ్ళడానికి వీల్లేని పరిస్థితి. ఏదోటి అవుతుందని వుండిపోయాను. తెల్లవారేసరికి బావ చాల తేలికగా వున్నాడు.

"థాంక్స్ శశీ! నిన్ను బాధపెట్టి వుంటాను"

"బాధ కాదు బాధ్యత నేను యింటికి పోయివస్తాను. అమ్మ నా గురించి కంగారుపడుతూంటుంది" అన్నాను యింటికి బయలుదేరుతూ

నాన్నగారు కాంప్‌లో వున్నారు. అమ్మ గట్టిగానే చీవాట్లు వేసింది. మంగళతో పెళ్ళికి వెళ్ళానని చెప్పాను.

రెండ్రోజుల్లో బావ జ్వరం తగ్గిపోయింది ఇంకా మంగళావాళ్ళు పెళ్ళి నుంచి రాలేదు నేనే యింటిదగ్గర పత్యం వంటచేసి (అమ్మ మంచం ఎక్కడంతో వీలయింది) పట్టుకెళ్లాను

కృతజ్ఞతగా చూశాడు భోజన

మయ్యాక హాల్లో కూర్చున్నాం యిద్దరం కబుర్లు చెప్పుకుంటూ

"నువ్వేం మాట్లాడవేమిటి అన్నీ నేనే చెబుతూంటే" అన్నా కోపంగా.

"నాకూ మాట్లాడదామనే వుంది. నువ్వేమంటావో?"

"ప్రొసీడ్."

"మనం పెళ్ళిచేసుకుందాం"

రాత్రి హఠాత్తుగా కరెంటుపోయినట్లు ఫీలయ్యాను రకరకాల సంఘర్షణలు. ప్రేమ పెళ్ళికి పరిష్కారం కాదు కాని ప్రేమను సాంఘికంగా శాసనం చేసుకోడానికి సూత్రం

"నీకిష్టంలేదా శశీ" బాధగా అడిగాడు.

"మన సమాజంలో పెళ్ళికి ఆడపిల్ల యిష్టం ఎంతమంది అడుగుతున్నారు బావా? నాన్నగారు ఒప్పుకుంటారా అని?"

"ఒప్పిద్దాం" నా మాటలకి ధైర్యం తెచ్చుకున్నాడు

"అది సులభంకాదు బావా. మన ఆశ"

"ఆశ వున్నప్పుడే ఆచరణ ఇది అంత తేలికగాదని నాకూ తెల్సు మనిద్దరికీ యిష్టమైంది మూఢో వర్గానికి భయపడి మనం ప్రయత్నం మానెయ్యడమెందుకు?"

"ఏం చేద్దాం మరి?"

"గుళ్ళో పెళ్ళి చేసుకుని వేరే కాపురం పెట్టడమే నాలుగు రోజులు మామయ్య అరచినా తర్వాత ఆయన రాజీ పడిపోతాడు."

"అది కృతఘ్నత అవుతుంది. పెంచి పెద్దచేశాక అభిప్రాయభేదం కారణంగా వాళ్ళని ఎదిరించడం, విలువ తీసిపడేయటం నా కిష్టముండదు"

"మీ నాన్న బాజా భజంత్రీలతో మన పెళ్ళి చేస్తాడనుకుంటున్నావా?"

"ఒప్పిస్తాను"

"ఓ. కె. నీ నమ్మకాన్ని ఎందుక్కాదనాలి" అన్నాడు నా చేతిని మెత్తగా నొక్కిపట్టి

రోజులు గడుస్తున్నాయి సౌభాగ్యం నాన్నగారితో 'డీల్' చెయ్యడానికి మనిద్దరికీ భయమేకదా! అమ్మే మధ్యవర్తి, అమ్మతో చెప్పడానికి తగిన సమయంకోసం ఎదురుచూస్తున్నాను.

ఓసారి అమ్మ, నేను భోంచేస్తూండగా 'మీ నాన్నగారు నీకు సంబంధాలు వెతుకుతున్నారు' అని చెప్పింది. నేను వుగ్గపెట్టుకుని బావ సంగతి చెప్పాను

అమ్మ అసహనంగా చూసింది. "అంతదాకా వచ్చింది మాట ఇది మీ నాన్నగారు వింటే ఎంత మండిపడతారో తెల్సా?"

"ఎన్నాళ్ళమ్మా కక్షలూ కావేషాలూ"

నేనేదో చెప్పబోతూంటే "చాల్లే నోర్ముయ్" అని కసిరిపడేసింది. మరో రెండు మూడుసార్లు అమ్మతో చెప్పినా

లాభం లేకపోయింది. నేను చెప్పింది ఆమె పూర్తిగా వినలేదు. నాన్నగారితో చెప్పడానికి అమ్మకూడ భయపడుతోం దన్నమాట!

"నేను చెప్పలేదా శశీ! ఎడారిలో ఏరువాక కనిపించదు. మాటల ద్వారా మీ వాళ్ళను మార్చలేవు." అన్నాడు ఓసారి కల్సినపుడు బావ.

"ఓ పని చేద్దామా? మీవాళ్ళు కళ్ళ కద్దుకుని మన పెళ్ళిచేస్తారు."

"ఏమిటి బాబూ"

"నువ్వు కాదన కూడదు."

"ప్రామిస్"

చెప్పాడు బావ.

సిగ్గుతో తల ఎత్తుకోలేకపోయాను.

"ఇది నిజం కాదని మనిద్దరికీ తెల్సు. ఇంతకిమించి మనకు దారి లేదేమో! నువ్వు మడిబట్ట కట్టుకుని కూర్చున్నావు"

బావ బలవంతంవల్ల అంగీక రించాను. ఇది రాజమార్గం కాదు అడ్డు దారి. గమ్యం తొందరగా చేరడానికి సాధనం.

అ రోజు వాంతి చేసుకుంటూంటే అమ్మ అడిగింది.

చెప్పాను.

"ఎన్నోనెల?" చెంపలు వాయిస్తూ అడిగింది.

"............ ...."

"ఎవరో చెప్పు."

"బావ...."

అమ్మ ఏడ్చింది. చివాట్లు పెట్టింది. ఇది తన పెంపకం లోపం అన్నది. నాన్నగారు యిచ్చిన స్వేచ్ఛ దుర్విని యోగం చేశానంది. ఆ రాత్రి ఈ విషయం నాన్నగారికి తెల్పింది. 'నిజమా మీ అమ్మ చెప్పింది' అడిగారు నన్ను.

నాన్నగారి చూపుని తట్టుకోలేక పోయాను. "నిజమే!"

"ఏదోలా యిద్దరికీ ముడిపెట్టి పడేయండి. మన పరువయినా దక్కించు కుందాం." అమ్మ చెప్పింది.

"కళ్ళుమూసుకుపోయి వళ్ళు అప్ప గించినందుకు అనుభవిస్తుంది. ఏడ్వనీ! ఆ వెధవమాత్రం నా అల్లుడు కాడు. అది జరగని పని." నాన్నగారిలో ఆవేశం పొంగింది.

"మనం పట్టుదలకుపోతే ఎలాగండీ" అమ్మ ప్రాధేయపడింది.

"నా కూతురు కులటయినా ఫర్వాలేదు. ఆ యిడియట్ ని మాత్రం వెళ్ళి అడగను. వాడి తండ్రి చేసిన ద్రోహాన్ని నేను మరచిపోతానా?...."

ఆ రాత్రే కాదు. మర్నాడు కూడ అమ్మ చెపితే మండిపడ్డారు. "మరోసారి చెప్పావో నేను మనిషిని కాదు" అని హెచ్చరించారు.

వారం గడిచింది. నాన్నగారు, అమ్మ నాతో మాట్లాడలేదు. ప్రేమించినవారి కోపాన్ని భరించడం నరకసదృశం. అమ్మ నన్ను బయటికికూడ పోనివ్వడం

లేదు. నిత్యం నా చుట్టూ కాపలా ! బావ నాకోసం ఎదురుచూస్తూంటాడు. ఎలా చెప్పాలి ఈ వార్త ? మరో వారం గడిచినా పరిస్థితిలో మార్పులేదు. నాన్నగారి మౌనం చిత్రవధ చేస్తోంది నన్ను.

"మన ఎత్తు చిత్తయింది బావా ! నాన్నగారు పెళ్ళికి అంగీకరించడంలేదు. నువ్వో ఒడ్డున, నేనీ ఒడ్డున. మధ్య కుటుంబవైరం కొండలా పెరిగిపోయి మనల్ని విడదీసిపడేసింది. మనం అదృష్టం యింతేనని సరిపెట్టుకోవాలి. ఇంతకంటె ఏం చెయ్యగలం ?" పోస్టులో వుత్తరం రాసి పడేశాను.

నాలుగురోజులు గడిచాయి.

"అలాగే కామేశ్వరీ... మన పంతాల గురించి వాళ్ళను వీధదీయడం ఎందుకు ?.... పోయి అడిగివస్తాను." అన్నారు నాన్నగారు అమ్మతో.

నాలో పున్నమి వ్యాపించింది. అడవిలో దారితప్పిపోయాక తారు రోడ్డుని చూసినట్లయింది. రిస్కుతీసుకున్నా కల ఫలించింది.

గంటలో నాన్నగారు తిరిగివచ్చారు. "చవట వెధవ.... ఇలాంటి వెధవల్ని కాల్చిపడేయాలి." తిడుతూనే లోపలికి వచ్చారు.

ఏం జరిగింది ? బావ ఏమన్నాడు ? పెళ్ళికి షరతేమయినా పెట్టాడా? ఆందోళనగా దగ్గరికెళ్ళాను.

"కామేశ్వరీ ! వాడు మన కొంప ముంచాడు. ఆదిచంద్ర కూతురు మంగళని ఇవాళ ప్రొద్దుటే పెళ్ళిచేసుకున్నాడుట. ."

నాలో పిడుగులుపడ్డాయి. మంచం మీదపడి కుళ్ళి కుళ్ళి ఏడ్చాను. వసంత మనుకుంటున్న వేళలో శిశిరం.

మర్నాడు బావ దగ్గర్నుంచి "శశీ ! నీ వుత్తరం చూశాక నాలో అగ్ని పర్వతాలు బద్దలయినాయి. మన కలయిక అసంభవమని తెల్సిపోయింది. ఆదిచంద్రగారు మంగళని చేసుకోమని కోరారు. నువ్వు లేనప్పుడు ఎవరయినా ఒకటేనని ఒప్పుకున్నాను. ఫేర్‌వెల్.... శశీ...." వుత్తరం వచ్చింది.

నేను నెలతప్పానని పనివాళ్ళవల్ల చుట్టూరా తెల్సింది. వెక్కిరింతలకి భయపడి అమ్మ యింటినుంచి కదలడం లేదు. 'నిన్ను కనడం నా ఖర్మే' అని రోతపడుతూంది నన్ను చూసి. నాన్నగారి స్నేహితులు కూడ 'ఏమిటోయ్ ! పెళ్ళి కంటె ముందుగా బారసాల విందు యిస్తున్నావుట' అని పరిహసించారుట.

"ఇదంతా నాటకమని" ఈ దశలో చెప్పినా ఎవరు నమ్ముతారు ? నా జీవిత వైఫల్యానికి కారణం విధా? అదృష్టమా? పంతమా? ఏది కారణం?

'కులట'గా కన్నీళ్ళమధ్య వుండలేక ముగింపు కోరుకున్నాను. నీ అక్క నిజాయితీ నీకయినా తెలియాలనీ వుత్తరం.

అభాగ్య సోదరి

శశి.